క్లుప్తంగా

భగవత్ నామ సంకీర్తనతో మోక్షం

బేతంచెర్ల: కలియుగంలో భగవంతుడి నామ సంకీర్తనముతో మోక్షం పొందవచ్చని పూదోట ఆశ్రమ నిర్వాహకులు గుండాగోపాలు, గౌరి హుసేన్‌రెడ్డి, భజనకృష్ణయ్య, డాక్టర్ నరసింహులు అన్నారు. పట్టణంలోని పూదోట ఆశ్రమంలో లోక కళ్యాణార్థం కొనసాగుతున్న విష్ణు సహస్రనామ సామూహిక పారాయణంలో పాల్గొన్న భక్తులకు అన్నదానానికి సోమవారం గుండా జగన్ మోహన్ రావు, అరుణ్ బాబు, తెలుగు వెంకటరమణ, బుగ్గన మహేశ్వర్‌రెడ్డి, కే. నాగేశ్వర్‌రెడ్డి, ఏ. మధు సూధన్ గుప్త, బుగ్గన చంద్రారెడ్డి రూ. 45,116 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు దాతను సత్కరించారు.

సంపూర్ణ పోషణే లక్ష్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత

సంజామల: పిల్లలు, గర్భిణులు, బాలింతల సంపూర్ణ పోషణే ప్రభుత్వ లక్ష్యమని, ఇందు కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో 4వ అంగన్‌వాడీలో జన్‌భాగిదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపడం వల్ల ప్రాథమిక విద్యా కోసం సంసిద్ధమవుతారన్నారు.

బీమా సాయం అందజేత

బేతంచెర్ల: మండలపరిధిలోని గోరుమానుకొండ గ్రామానికి చెందిన గుద్దేటి రామ చిరంజీవి అనారోగ్యంతో మరణించారు. మృతుని భార్య చిన్నమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును సోమవారం గ్రామ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమ సహాయకులు నాగార్జున, గ్రామ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, వలంటీర్ ధరణి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి

కోవెలకుంట్ల: జలజీవన్ మిషన్ పథకం ద్వారా అమడాల గ్రామంలో ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి కనెక్షన్ ఇస్తున్నట్లు సర్పంచ్ బాలమద్దిలేటి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని బీసీ కాలనీలో 60 ఇళ్లకు ఉచిత కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల మినరల్ వాటర్ ప్లాంట్, చేతిపంపులు చెడిపోవడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి నీటి సమస్య పరిష్కరించామని చెప్పారు. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకరయ్య పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈఓ సోమశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ స్కూలు యాజమాన్యాలు ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకుండా, అర్హత కలిగిన అధ్యాపకులు, ఆట స్థలం లేకుండా రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు.

ఇంటి వద్దకే మెరుగైన వైద్యం



వృదురాలికి ఇంటి వద్దనే వైద్య సేవలందిస్తున్న డాక్టర్ విద్యాసాగర్

కోవెలకుంట్ల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో రోగులకు ఇంటివద్దనే మెరుగైన వైద్య సేవలందుతున్నాయని రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని అన్నారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని గుండుపాపల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందించారు. వారు మాట్లాడుతూ వివిధ రోగాలతో బాధపడుతున్న వ్యక్తులు వైద్యం నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా డాక్టర్లు ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, ప్రభావతి, ఏఎన్‌ఎం ఖాజాబీ, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

డోన్ టౌన్: మండలంలోని ఓబులాపురం మిట్ట వద్ద ఉన్న జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న సునీల్ అనే యువకుడిని బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ ఢీ కొనడంతో తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

పశు బీమా.. పాడి రైతుకు ధీమా

- వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- పశుసంపద పరిరక్షణకు కృషి
- పశువులు, జీవాలు మరణిస్తే యజమానులకు పరిహారం



డోన్ సాక్షి నివాస్ ప్రాంతంలో పశువుల ఫాం

డోన్: పశు పోషకులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పాడి రైతులను ఆదుకునేలా వైఎస్సార్ పశుబీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోని పశుసంపద పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. పశువులు, గొర్రెలు, మేకలు మరణిస్తే వాటిని పోషిస్తున్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం లైవ్ స్టాక్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ మేరకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ మార్గదర్శకాలు జారీచేశారు. పాడి పశువులతో పాటు ఎద్దులు, కోడెలు, దున్నలకు కూడా బీమా సౌకర్యం కల్పించారు. అలాగే సన్న జీవాల కింద గొర్రెలు, మేకలతో పాటు పందుల పెంపకందారులకు కూడా బీమా పథకం వర్తింపజేశారు.

వైఎస్సార్ పశుబీమా పథకం లక్ష్యాలు

నంద్యాల జిల్లాలో బీమాకు అర్హత ఉన్న తెల్ల, నల్లజాతి పశువులు 3,11,737 ఉన్నాయి. ఈ ఏడాది 10,950 పశువులకు బీమా చేయించాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. పశు బీమా పథకానికి యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేసింది. జాతి పశువులకు రూ.30 వేలు, నాటు పశువులకు రూ.15 వేలు, సన్న జీవాలకు రూ.6 వేలలోపు బీమా చేస్తా రు. నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో 73,286 తెల్లజాతి, నల్లజాతి పశువు లు, అలాగే 3,19,431 గొర్రెలు, మేకలు ఉన్నాయి.

బీమా వివరాలు

బీమా మొత్తం	లబ్ధిదారుని వాటా		వ్యవధి
	బీపీఎల్	ఏపీఎల్	
రూ.30 వేలు	రూ.384	రూ.960	3 సంవత్సరాలు
రూ.15 వేలు	రూ.192	రూ.480	3 సంవత్సరాలు
	గొర్రెలు లేదా మేకలకు		
రూ.6 వేలు	రూ.36	రూ.90	సంవత్సరం
రూ.6 వేలు	రూ.54	రూ.135	2 సంవత్సరాలు
రూ.6 వేలు	రూ.75	రూ.187.50	3 సంవత్సరాలు

అర్హత ఇలా..

పాడి పశువులు/ఆవులు రెండేళ్ల నుంచి పదేళ్ల వరకు, గేదెలు మూడేళ్ల నుంచి 12 ఏళ్ల వరకు, ఎద్దులు, కోడెలు, దున్నలకు ఆరు నెలల నుంచి పదేళ్ల వరకు, మిగతా పశువులకు రెండేళ్ల నుంచి పదేళ్ల వరకు, గొర్రెలు, మేకలు, పందులకు ఆరు నెలల పైబడిన వాటన్నింటికీ బీమా సౌకర్యం వర్తిస్తుంది. పశు బీమా వర్తించే లబ్ధిదారులను ప్రభుత్వం రెండు వర్గాలుగా విభజించింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న రైతులకు రేషన్ కార్డు ఉంటే చాలు పశు బీమా వర్తిస్తుంది. తక్కువ ఆదాయం కలిగిన రైతులు 20 శాతం, అధిక ఆదాయం కలిగిన రైతులు 50 శాతం ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

పశు పెంపకందారులకు వరం



రాష్ట్ర ప్రభుత్వం పాడి పశువులకు ఇన్సూరెన్స్ వర్తింపజేయడం ఒక వరంగా భావించవచ్చు.స్థానిక రైతు భరోసా కేంద్రాలు, పశు వైద్య కేంద్రాల్లో అధికారులను సంప్రదించి పశు సంరక్షణకు బీమా చేయించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ హాస్పిటల్, డోన్

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



గొర్రెలు, మేకల పెంపకందారులమైన యాదవ, కురువ కులస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా వైఎస్సార్ బీమా పథకం ప్రవేశపెట్టి సన్న జీవాలకు ప్రభుత్వం నామమాత్రపు ప్రీమియంపై బీమా చేయించడం శుభపరిణామం. సన్న జీవాలకు నష్టం జరిగితే పూర్తి పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– మనోహర్ యాదవ్, గొర్రెల పెంపకందారుడు, వెంకటనాయునిపల్లె

మూగజీవాల పెంపకందారులకు భద్రత



వైఎస్సార్ పశు బీమా పథకం కింద ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు ఆకస్మికంగా మరణిస్తే పరిహారం చెల్లించేలా ప్రభుత్వం ఏర్పాటుచేయడం ఆనందదాయకం. మూగజీవాల పెంపకందారులందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞులై ఉంటారు.

– బద్దల రాజ్‌కుమార్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు, డోన్

నేత్రాలు దానం



నేత్రదాన పత్రాలను అందిస్తున్న కుటుంబ సభ్యులు

డోన్ టౌన్: గుండెపోటుతో అకాల మృత్యువు చెందిన భారతీబాయి అనే మహిళ నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన హరిశంకర రావు భార్య భారతీబాయి(60) ఆదివారం రాత్రి (సోమవారం తెల్లవారు జామున) నిద్రలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ కుటుంబానికి పరిచయం ఉన్న సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫి ఆమె కళ్లను దానం చేయమని చెప్పడంతో భర్తతో పాటు కుమారులు, కుటుంబ సభ్యులు అంగీకారం తెలపారు.కర్నూలు ప్రాంతీయ కంటి వైద్యశాలకు సమాచారం ఇవ్వగా అక్కడి నుంచి వచ్చిన సిబ్బంది సోమవారం రెండు కళ్లను తీసుకెళ్లారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైస్ ఎంపీపీ చిన్నబాబు సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల మాజీ పీఎంసీ చైర్మన్ నబి రసూల్, హెచ్‌ఎం శీత రామమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలింగ్ మిషన్ ఏర్పాటు

బనగానపల్లెరూరల్: మండలంలోని యనకండ్ల గ్రామంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌లో కూలింగ్ మిషన్‌ను ఎంపీడీఓ శివరామయ్య ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. రెండు నెలల క్రితం ప్రారంభించిన వాటర్ ప్లాంట్‌లో గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశాలతో కూలింగ్ మిషన్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి, ఏఈ సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇచ్చిన హామీలన్నీ అమలు



చిన్నరాజుపాలెంతండాలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- పసుపల గ్రామ పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం

బనగానపల్లె : జగనన్న ప్రజాసంకల్పయాత్రలో, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం అమలయ్యాయని, హామీ ఇవ్వని మరెన్నో పథకాలను కూడా అమలు పరుస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మండలంలోని పసుపల గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నరాజుపాళెం , చిన్నరాజు పాళెంతండా గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ మానసవీణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మోహన్‌బాబు, లక్ష్మీబాయ్, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి , ఉపసర్పంచ్‌లు హేమలత రెడ్డి, బాలజీ నాయక్, ఎంపీటీసీ మహేశ్వరమ్మలతో పాటు ప్రముఖ వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామంలోని ప్రతి గడప గడప వద్దకు వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రానివారు తమదృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. నిధులు మంజూరు చేయించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఏఈ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్ నాయక్, పాపన్న, రమేష్‌నాయక్, శ్రీరామ్‌నాయక్, సుబ్బానాయక్, మిట్యానాయక్, శంకర్ నాయక్ గోవింద్‌నాయక్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



విద్యార్థులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

అవుకు(కొలిమిగుండ్ల): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సోమవారం కొలిమిగుండ్ల మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హేమమహేంద్ర (541 మార్కులు), జి.సుష్మిత (536), షణ్ముఖసాయి (519)లను ప్రోత్సాహక నగదు మెడల్, ప్రశంసా పత్రంతో సత్కరించారు. వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్ రాజారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రసేనా రెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సెరినా (559), ఆకాష్ (542), మణిదీప్ (517)లకు సోమవారం ఎంఈఓ యశోధ ఆణిముత్యాల పురస్కారాలను అందజేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: సీతారామాపురం జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం వజిదున్నిసా బేగం ఆధ్వర్యంలో సర్పంచ్ చిట్టి వేణుగోపాలు రెడ్డి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన రమాదేవి, చెన్న కేశవరెడ్డి, హైమావతిలకు మెడల్స్ తో పాటు నగదును అందజశారు. అలాగే యంబాయి జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన గ్రామ సర్పంచ్ యుగంధర్ రెడ్డి చేతుల మీదుగా సంధ్య, మేఘన, శృతి జగనన్న అణిముత్యాల మెడల్స్‌తో పాటు నగదు బహుమతులను అందజేశారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని కైప జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులు రవిశేఖర్, ఎస్ ఫజల్‌బాషా, కె.మౌనికకు హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి ప్రోత్సాహక నగదుతో పాటు జ్ఞాపిక, మెడల్‌తో పాటు దుశ్శాలువా వేసి సన్మానించారు.

ప్యాపిలి: రాచర్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సోమవారం ఘనంగా సత్కరించారు. తులసి (555), లావణ్య (544), దాక్షాయణి (505)లకు హెచ్‌ఎం ఉమాదేవి ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ప్యాపిలి ఎంఈఓగా వెంకటేశ్ నాయక్

ప్యాపిలి: ప్యాపిలి ఎంఈఓగా వెంకటేశ్ నాయక్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. పీఆర్ పల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న వెంకటేశ్ నాయక్ ఎంఈఓగా పదోన్నతి పొందిన విషయం విదితమే. సోమవారం బాధ్యతలు తీసుకున్న ఎంఈఓను ఎస్టీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

బనగానపల్లె ఎంఈఓ–2గా శ్రీనివాసులు

బనగానపల్లెరూరల్: మండల విద్యాధికారి–2గా శ్రీనివాసులు బాధ్యతలను సోమవారం స్వీకరించారు. శ్రీనివాసులు ప్రస్తుతం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన ఎంఈఓ స్వరూపకు తన జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.

జేఈఈ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ



చరణ్‌తేజ్

బనగానపల్లెరూరల్: బనగానపల్లెకు చెందిన ఉపాధ్యాయులు రామకృష్ణ, హేమకుమారి దంపతుల కుమారుడు జే.చరణ్‌తేజ్ జేఈఈ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 337వ ర్యాంకు సాధించినట్లు కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు. చరణ్‌తేజ్‌ను పలువురు ఉపాధ్యాయులు, బంధుమిత్రులు అభినందించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

డోన్ టౌన్: ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో డోన్, ప్యాపిలి మండలాలలోని 120 కుటుంబాలకు బియ్యం, కంది పప్పు, రాగులు, గోధుమలు, వంట నూనె తదితర నిత్యావసర సరుకులను ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. పట్టణంలోని కార్యాలయంలో సోమవారం సంస్థ ఏరియా ఇన్‌చార్జ్ నాగభూషణం ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏఎస్ఐ గోపాల్, ఆర్గనైజర్ నాగేంద్ర, మోహన్, అయ్యస్వామి, సుబ్బన్న, కౌన్సిలర్ ఇంద్రలత తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల: ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ రాధిక సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని 12 గ్రామసచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి నవరత్న పథకాలు వర్తింపు కోసం నెల రోజులపాటు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. వలంటీర్లు వారికి కేటాయించిన ఇళ్లను సందర్శించి అన్ని అర్హతలు ఉండి ప్రభుత్వ పథకాల లబ్ధిపొందని కుటుంబాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్ పాల్గొన్నారు.

సర్వేను సక్రమంగా నిర్వహించాలి

సంజామల: సంజామల గ్రామాలలో ప్రజలకు అవసరమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని సక్రమంగా నిర్వహించేలా చూడాలని ఎంపీడీఓ నాగ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించేందుకు వలంటరీ ఇంటింటికి తిరిగి నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో విజయ్ కుమార్ రెడ్డి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో రైల్వే ఉద్యోగి మృతి



మృతిచెందిన పి.కృష్ణ

డోన్ టౌన్ : స్థానిక రైల్వే స్టేషన్‌లో సిగ్నలింగ్, టెలికాం విభాగంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న పి.కృష్ణ (30) రైల్వే క్వార్టర్స్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ నగేష్ తెలిపారు. తోటి ఉద్యోగులు గమనించి పట్టణ పోలీసులు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి ఎస్ఐతో పాటు ఏఎస్ఐ భాస్కర్, సిబ్బంది రవీంద్రనాథ్‌రెడ్డి వెళ్లి పరిశీలించారు. బెడ్ రూంలో ఉన్న ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకునేందుకు సిద్ధం చేసుకున్నట్లు ఆనవాళ్లు ఉండగా, పక్క గదిలో పడుకొని మృతి చెందినట్లు గుర్తించారు. మృత దేహం పక్కన మద్యం బాటిళ్లు, గొంతుకు రక్తం చారలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు మద్యానికి అలవాటు పడటంతో ఇంట్లో భార్యతో తరచూ గొడవ పడే వాడని, కొద్ది రోజుల క్రితం మృతిని భార్య మౌనిక వారి గ్రామమైన నంద్యాల జిల్లా చాపిరేవులకు వెళ్లి పోయిందని చెప్పారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

డోన్ టౌన్: మండలంలోని చిన్నమల్కాపురం గ్రామంలో సోమవారం దాడులు నిర్వహించి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 240 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, ఒక బైకును స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భీమలింగ తెలిపారు. కర్నూలు వెంకరమణ కాలనీకి చెందిన ఈడిగ గిరిబాబు, పట్టణంలోని ఆటో నగర్‌కు చెందిన ఈడిగ కేశవయ్య, కృష్ణగిరి మండలం కొయిలకొండకు చెందిన శీలబోయిన ఆంజనేయులు, చిన్నమల్కాపురంకు చెందిన అంపన్నగారి రామాంజనేయులు, వలిసెల గ్రామానికి చెందిన బండారు రవి అక్రమ మద్యం కలిగివున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో వలిసెలకు చెందిన బండారు రవి పరారైనట్లు తెలిపారు.

డోన్ టౌన్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఇన్‌చార్జ్ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపారు. కృష్ణగిరి మండలం పందిర్లపల్లెకు చెందిన రామాంజనేయులు గౌడ్ సోమవారం 60 మద్యం బాటిళ్లను స్వగ్రామానికి తీసుకెళుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మద్యం స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

నాటుసారా స్వాధీనం

అవుకు(కొలిమిగుండ్ల): కొలిమిగుండ్ల స్టేషన్ పరిధిలో సోమవారం వేర్వేరు చోట్ల జరిగిన దాడుల్లో 210 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. సారా విక్రయిస్తున్న ఐదుగురిని, సరఫరా దారుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

అవుకు: కునుకుంట్ల గ్రామ సమీపంలో నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని సోమవారం సెబ్ ఎస్ఐ దౌలత్‌ఖాన్ అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, బైక్‌ను సీజ్ చేశామని తెలిపారు.

కోలుకోలేక కౌలు రైతు మృతి

బనగానపల్లెరూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పండ్లాపురం గ్రామానికి చెందిన బుర్ర జనార్ధన్ (36) అనే కౌలు రైతు కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయ రెడ్డి సోమవారం తెలిపారు. బుర్ర జనార్ధన్ భూమి కౌలు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పంటలు రాక పెట్టుబడి కోసం చేసిన అప్పులు చెల్లించలేక మనస్తాపంతో ఈ నెల 16న ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు కర్నూలు వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

'కుల సంఘం వేధింపులతోనే గుండె పోటుతో మృతి'

డోన్ టౌన్: తన కుమారుడిని కుల సంఘం నాయకులు వేధింపులకు గురి చేస్తూ మానసికంగా హింసిస్తున్నారన్న మనోవేదనతో గుండెపోటుకు గురై తన భార్య మృతి చెందిందని పట్టణానికి చెందిన హరిశంకరరావు ఆరోపించాడు. పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన హరిశంకరరావు కుమారుడు ఉమామహేశ్వరావు కర్నూలులో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. అతనిపై కుల సంఘం నాయకులు లేనిపోని ఆరోపణలతో ఫ్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఈనెల 14న ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు సర్ది చెప్పి ఉమామహేశ్వరరావుతో లెటర్ రాయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మృతురాలు కుమారుడి ఉద్యోగానికి ఎవైనా ఇబ్బందులు కలుగుతాయని నాలుగురోజులుగా ఆలోచనలో పడిపోయిందన్నారు. ఈ క్రమంలో ఆదివారం గుండె పోటుకు గురై మృతి చెందినట్లు తెలిపారు.

వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



పెట్రోల్ బంకు కూడలి వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కాటసాని తిరుపాల్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్‌బంకు సర్కిల్ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరుడు, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి సోమవారం స్థల పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో రూ.22 కోట్లతో శరవేగంగా పూర్తికావచ్చిన ప్రభుత్వ ఏరియా వైద్యశాల, అలాగే పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి జీఎం టాకీస్ వరకు రూ.8 కోట్లు జరుగుతున్న ఫోర్ లైన్ రోడ్డు అభివృద్ధి పనులు మరిన్ని కొద్ది రోజుల్లో పూర్తవుతాయన్నారు. పెట్రోల్ బంకు సర్కిల్‌లో ట్రాఫిక్ ఇబ్బందిలేకుండా కొత్తగా దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు జిల్లెల్ల శంకర్‌రెడ్డి, కంబగిరి, దొరస్వామి, శిల్పకారుడు కోవ్వురు సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పాలన



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు అన్నారు. సోమవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ వెంగన్న, గ్రామ సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, మాజీ సర్పంచ్ జగన్‌మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి, వైస్ ఎంపీపీ రంగస్వామి, ఎంపీటీసీలు నాగేషు, వెంకట సుబ్బమ్మ పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తితో కలిసి ఎంపీపీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, విద్యుత్ లైన్లు సరి చేయిస్తామని, స్తంభాలను ఏర్పాటు చేయడమే కాకుండా, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ఇంటింటికీ కుళాయి ఇవ్వడమే కాకుండా గోరుకల్లు రిజర్వాయర్ ద్వార శుద్ధమైన నీరు అందజేస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, ఆర్వేటి శేఖరయ్య, బీరవోలు నాగేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర రావు, చిన్నమోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిమోతి, కిట్టన్న, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందాలి



ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అవుకు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దానికి తగినట్టుగానే ప్రతి ఒక్కరూ పనులు చేయాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ పథకానికి అర్హత ఉండి, లబ్ధి పొందని వారు ఒక్కరు కూడా ఉండకూడదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని చెప్పారు. ఈ నెల ఆఖరు కంతా ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటివద్దకు వెళ్లి ఎలాంటి కారణాల వల్ల వారికి పథకాలు అందడంలేదో తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, తహసీల్దార్‌శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్, ఈఓఆర్‌డీ రామక్రిష్ణవేణి పాల్గొన్నారు.